క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని నిరసన



85వ వార్డు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

అగనంపూడి: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ పనిచేసే కార్మికుల కంటే పెత్తనం చేసే వారే ఎక్కువ అయిపోయారని మండిపడ్డారు. కార్మికులకు పూర్తి స్థాయిలో జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో గొలగాని అప్పారావు, ఎస్.గణేష్, బి.మీనాక్షి, కె.సత్యవతి, నాగేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

అన్నసమారాధన



అన్నదానం చేస్తున్న ఉమామహేశ్వరస్వామి ఆలయ కమిటీ, దాతలు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డులోని పెదమడక ఉమామహేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం మాస శివరాత్రి పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం గొంతిన సాయి చైతన్య జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పండూరి వెంకటరమణ ఆధ్వర్యంలో అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ధర్మాల సుబ్బారావు, ప్రతినిధులు గొక్కాడ లోవరాజు, కొలిపాక అప్పారావు, సోమేశ్వరరావు, కరణం సన్ని, గుదే అప్పలరాజు పాల్గొన్నారు.

స్వర్ణ నూకాంబిక ఆలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక



అమ్మవారి సన్నిధిలో నూతన కమిటీ సభ్యులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దయాల్‌నగర్ క్వారీ రోడ్డులో కొలువై ఉన్న స్వర్ణ నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా గండిబోయిన తాతారావు ఎన్నికయ్యారు. ఆలయ ఆవరణలో నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దువ్వాడ అప్పారావు, కోశాధికారిగా వైబీ నాయుడు, ఉపాధ్యక్షుడిగా ఆడారి రమణ, సంయుక్త కార్యదర్శిగా బొమ్మల అప్పలరాజు, సంయుక్త కోశాధికారిగా కండేపల్లి అక్కులు, నిర్వహణ కార్యదర్శిగా దుర్గారావును ఎన్నుకున్నారు.

ఎంవీఆర్‌లో నేడు మెగా జాబ్ మేళా

గాజువాక: స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తెలిపారు. ఆశ్రయ జిల్లా వికలాంగుల సమాఖ్య, చేషర్ డిజేబుల్డ్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ జాబ్ మేళాలో 15కు పైగా కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. 100కు పైగా ఉద్యోగాలు కల్పించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ జాబ్ మేళాను దివ్యాంగులు, నిరుద్యోగ యువతీ యువకులు వినియోగించుకోవాలని కోరారు. అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్‌లో కళాశాల చినగంట్యాడ క్యాంపస్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

పశువైద్య శిబిరానికి స్పందన



పశువులకు నట్ల నివారణ మందు వేస్తున్న డాక్టర్ అశ్విని

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు మంత్రిపాలెంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 పశువులకు నట్ల నివారణ మందులు వేశారు. పశు వైద్యురాలు డాక్టర్ అశ్విని ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో వార్డు నాయకులు ఇల్లపు ప్రసాద్ , జెవీవో కల్యాణి, లక్ష్మణ్, పద్మ, నాగేశ్వరరావు, నాయకులు సేనాపతి రాజు, అల్లుమల్ల రాజు, సేనాపతి మణికాంత్ పాల్గొన్నారు.

అందాల సిరి.. ఆహ్లాద ఝరి



అప్పికొండ బీచ్

పారిశ్రామిక ప్రాంతంగా గుర్తింపు పొందిన గాజువాక పర్యాటకానికి కేరాఫ్‌గా నిలుస్తోంది. ఆహ్లాదం పంచే తీరాలతో పాటు ఆధ్యాత్మికతకు నెలవైన పురాతన ఆలయాలు అనేకం ఉన్నాయి. వీటిని అభివృద్ధి చేసి వసతులు కల్పిస్తే టూరిజం డెస్టినీగా మారుతుంది. ఈ ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు చేసినా కార్యరూపం దాల్చలేదు. పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామంటూ ఊదర గొడుతున్న కూటమి ప్రభుత్వం గాజువాక ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాలపై దృష్టిసారించాలని టూరిజం నిపుణులు సూచిస్తున్నారు.

గాజువాక, పెదగంట్యాడ మండలాల పరిధిలో పర్యాటక అవకాశాలు ఉన్న ప్రాంతాలు ఇవిగో..!. – గాజువాక



గంగవరం కొండపై నుంచి యారాడ బీచ్ అందాలు

యారాడ.. సహజ సౌందర్యాల జాడ

సాగర తీరంలో కోనసీమను తలపించే పర్యాటక గ్రామం యారాడ. గ్రామానికి మూడు వైపులా కొండలు, మరోవైపు చూడ చక్కని సముద్రంతో ఎంతో రమణీయంగా ఉంటుంది. కొండపై నుంచి గ్రామాన్ని చూస్తే చుట్టూ పచ్చని అరటి, కొబ్బరి తోటలు, సముద్రపు నీలి కెరటాలు, చెట్ల మధ్య బొమ్మరిళ్లలా గ్రామంలోని నివాసాలు కనిపిస్తాయి. పారిశ్రామిక ప్రాంతానికి చేరువగా ఉన్న యారాడను పరికిస్తే ఓ నూతన ప్రపంచం, వింత అనుభూతి ఆవిష్కృతమవుతుంది. మొదటి కొండపై నుంచి వెనుదిరిగి చూస్తే షిప్‌యార్డ్ మొదలుకొని నేవల్ డాక్‌యార్డ్, విశాఖ పోర్టు ట్రస్టు, హెచ్‌పీసీఎల్, కోరమాండల్ కర్మాగారాలు క్యూలో నిల్చొని ఉన్నట్టు కనిపిస్తాయి.

దారిపొడువునా ఆహ్లాదం

గంగవరం గ్రామం నుంచి యారాడ బీచ్ వరకూ సుమారు ఎనిమిది కిలోమీటర్ల పొడవున మరో చక్కటి రోడ్డు మార్గం కూడా ఉంది. ఈ మార్గంలో వెళ్తుంటే పచ్చటి కొండలే కాదు.. విశాఖ ఏజెన్సీని తలపించే అందాలన్నీ పలకరిస్తాయి. విశాఖకు వచ్చే అనేకమంది విదేశీయులు సైతం ఈ ప్రాంతానికి వచ్చి సాగర తీరంలో సేద తీరి వెళ్తుంటారు.

వావ్..!



ఉక్కునగరంలో కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఆనుకొని ఏర్పాటైన నగరం ఉక్కునగరం. ఇదో మినీ ఇండియా. 12 సెక్టార్లు ఉన్న ఉక్కునగరంలో ప్రతిదీ విశేషమే. ఉక్కునగరం ప్రవేశం వద్ద నెహ్రూ పార్కు సందర్శకులకు విశేష అనుభూతిని కలిగిస్తుంది. దానికి ఆనుకొని స్వర్ణజయంతి పార్కు, రెండు పార్కుల మధ్యలో నుంచి ఉత్తర భాగంలో ఏర్పాటైన కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను సందర్శిస్తే ఆ ఆనందం ఎప్పటికీ మరువలేము. ఇప్పటికే అనేక ప్రాంతాల నుంచి వీటిని చూడడానికి సందర్శకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. దీనికి కొద్దిపాటి దూరంలో ఇందిరా పార్కు మరింత ఆహ్లాదం పంచుతుంది. పార్కులో బోటు షికారు కూడా ఉండేది. సాంకేతిక కారణాలతో ప్రస్తుతం దాన్ని నిలిపివేశారు. ఉక్కునగరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, పూరీ జగన్నాథస్వామి ఆలయం, అయ్యప్ప ఆలయం, షిర్డీ సాయి ఆలయాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తాయి. ప్రభుత్వం చిత్తశుద్ధితో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తే మరింత ఆదరణ, ఆదాయ వనరులు అభివృద్ధి చేసుకోవచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.





శిల్పాలు.. ఆకర్షిస్తున్న గుహలు

సువిశాలమైన విశాఖ సాగర తీరంలో పెద్దగా ప్రచారం లేని మరో పర్యాటక ప్రదేశం పెదగంట్యాడ మండలంలోని పాత గంగవరం. గంగవరం పోర్టు వెనుక భాగంలోని సముద్ర తీరం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది. ఇక్కడి కొండపై కొలువుదీరిన రాధామాధవస్వామి ఆలయం వెనుక.. సముద్రం ఒడ్డున ఉన్న ఓ కొండ అందమైన గుహలతో విరాజిల్లుతోంది. రాధామాధవస్వామి ఆలయానికెళ్లే వారంతా రాళ్లమధ్య ఆటలాడుతూ ఫొటోలు దిగుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతున్నారు.

ఆధ్యాత్మికతకు నెలవు నాగదేవత కొండ



గాజువాకకు ఏడు కిలోమీటర్ల దూరంలో సహజ సిద్ధంగా ఏర్పడిన నాగదేవత కొండ ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కొండ మధ్య భాగంలో వెలసిన నాగదేవతను దర్శించుకునే భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. బౌద్ధ సంఘాల ప్రతినిధులు కొండచుట్టూ ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహాలు అక్కడ ప్రత్యేక ఆకర్షణగా అందర్నీ అలరిస్తుంటాయి. దువ్వాడ రైల్వే స్టేషన్‌కు ఆనుకొని ఉన్న ఈ కొండ దిగే సమయంలో గాజువాక చిత్రం మంత్రముగ్దుల్ని చేస్తుంది. ఈ కొండను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే రైల్వే చిత్రపటంలో ప్రముఖ స్టేషన్‌గా సుస్థిర స్థానాన్ని సాధిస్తున్న దువ్వాడ రైల్వే స్టేషన్‌కు మరింత ప్రాచుర్యం పెరుగుతుందనడంలో అతిశయోక్తి లేదని పలువురు పేర్కొంటున్నారు.



అప్పికొండ సోమేశ్వరాలయం

చారిత్రక నేపథ్యం అప్పికొండ సొంతం

అప్పికొండ సోమేశ్వర ఆలయం గాజువాకకు దక్షిణాన సుమారు 18 కిలోమీటర్ల దూరంలో కడలి అంచున వెలిసింది. ఈ ఆలయానికి 900 ఏళ్ల చరిత్ర ఉంది. ఇది భారతదేశంలో మూడో దేవాలయం. ఇక్కడ వెలసిన శివలింగాలు, ఆకట్టుకొనే అతిపెద్ద నల్లరాతి శిల్పాలు, చోళుల శిలాశాసనాలు, మహానంది, ప్రశాంత సముద్ర తీర ప్రాంతం సొంతం. సముద్రంలోని కొండపై డచ్‌ల కాలం నాటి స్థూపాలు, శిల్పాలు గత ప్రాభవానికి సాక్షీభూతంగా నిలిచి పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. 110 అడుగుల వైశాల్యంలో పూర్తిగా రాతితో సోమేశ్వర ఆలయాన్ని నిర్మించారు. ద్రవిడ సాంప్రదాయాన్ని పుణికి పుచ్చుకొని ఉన్న ఈ ఆలయాన్ని పశ్చిమ చాళుక్యులు నిర్మించారని పరిశోధకుల అంచనా.

ప్రతిపాదనల్లోనే అప్పికొండ అభివృద్ధి

కళా నైపుణ్యానికి అద్దం పట్టే అప్పికొండను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని గతంలో ప్రతిపాదనలు కూడా చేశారు. రూ.5 కోట్లతో సముద్ర తీరంలో వివిధ సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని ఏడేళ్ల కిందట చేసిన ప్రతిపాదనలు పడకేశాయి.

మెరుగైన సేవలు అందిస్తాం

ఆర్టీవో జయప్రకాష్



ఆర్టీవో జయప్రకాష్‌ను సత్కరిస్తున్న ప్రజా సంఘాల నేతలు

అగనంపూడి: వాహనాల రిజిస్ట్రేషన్లు, రెన్యువల్, డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం వచ్చే వారికి ఇబ్బంది కలగకుండా మెరుగైన సేవలు అందిస్తున్నామని గాజువాక ఆర్టీవో వి.జయప్రకాష్ అన్నారు. ఆర్టీవో కార్యాలయం అగనంపూడిలో ఏర్పాటు చేసిన 8 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక నాయకులు ఆర్టీవోను సత్కరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యాలయ పని కోసం వచ్చేవారు కార్యాలయంలో నేరుగా సంప్రదిస్తే చాలన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఏవో కృష్ణమోహన్, ఏఎంవీ సౌజన్య, నాయకులు బి.సత్యనారాయణ, సత్యారావు, ఈశ్వరరావు, ఎం.వి.రమణ, బి.చందు రమేష్, ఎస్.సింహాచలం, రుద్రకుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని ధర్నా



ధర్నాలో ప్రసంగిస్తున్న మంత్రి రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. జీతాల అంశంపై యూనియన్ ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ న్యాయబద్ధంగా జీతాలు ఇవ్వకుండా కార్మికుల జీతాలతో చెలగాటమాడడం దుర్మార్గమన్నారు. కార్మికుల కుటుంబ సభ్యులు విద్యాపరంగా, వైద్యపరంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. పిల్లలకు సరైన పోషకాహారం కూడా ఇవ్వలేని పరిస్థితిలో కార్మికులు ఉన్నారన్నారు. యూనియన్ అధ్యక్షులు పి.వి. రమణమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో నీరుకొండ రామచంద్రరావు, బి.ఎస్. రాజు, ప్రభాకరరెడ్డి, నడుపూరి వెంకన్న, మద్ది అప్పలరాజురెడ్డి, కొమ్ము ప్రసాద్, పి.వి నగేష్, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



బీసీ గేటు వద్ద ఆందోళన చేస్తున్న ఇంటక్ నాయకులు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (ఇంటక్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, బోనస్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పల్లం గోపి, వంశీకృష్ణ యాదవ్, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, అవతారం, రమణమూర్తి, మంత్రి గోపీనారాయణ పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్యామలా నవరాత్రి ఉత్సవాలు



విద్యుత్ వెలుగుల్లో ఉక్కు త్రిశక్తి దేవాలయం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయంలో ఈనెల 30 నుంచి శ్యామలా(గుప్త) నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ ఉత్సవాల వివరాలను వెల్లడించారు. ఫిబ్రవరి 7 వరకు నిర్వహించనున్న ఉత్సవాల్లో ప్రతీ రోజు వివిధ పూజలు నిర్వహించనున్నారు. 30న శీఘ్రదేవాతా అనుగ్రహం కోసం లఘు శ్యామల పూజలు, 31న వాక్‌శుద్ధి కోసం వాగ్వాదినీ శ్యామల పూజలు చేయనున్నారు. ఫిబ్రవరి 1న శత్రుభయ నివారణ, భయంకర విపత్తుల నివారణ కోసం రుద్ర శ్యామల పూజలు, 2న తియ్యని పలుకు నిమిత్తం శుక శ్యామల పూజ, 3న సమస్త కోరికలు నెరవేరడానికి కల్పవల్లీ శ్యామల పూజలు, 4న శారికా శ్యామల పూజలు, 5న సకల కార్యసిద్ధి కోసం సర్వసిద్ధి మాతంగి పూజలు, 6న వివాహ కార్యాలు, అన్యోన్య దాంపత్యం కోసం కల్యాణ మాతంగి పూజ, 7న సర్వజన వశీకరణ, భూసంబంధ కార్యాల కోసం రాజశ్యామల పూజలు నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విశేషంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయ భవనాల్లో కేటరింగ్ వ్యాపారం!



ఆలయానికి సంబంధించిన నివాసంలో ఉన్న వస్తువులు



ప్రసన్న గిరిపై ఆలయ భవనంలో కేటరింగ్ పనులు నిర్వహిస్తున్న దృశ్యం

పట్టించుకోని దేవదాయ అధికారులు

అక్కిరెడ్డిపాలెం: దేవదాయ శాఖకు చెందిన ఆలయ ఆస్తుల (గృహాలు, కార్యాలయాలు)ను ప్రైవేట్ వ్యక్తులు హస్తగతం చేసుకున్నారు. అందులో దర్జాగా ఉచితంగా వ్యాపారాలు చేసుకుంటున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇదీ విషయం

భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద ప్రసన్న వేంకటేశ్వరుడు కొలువు తీరిన ప్రసన్నగిరిపై అర్చకులు, సిబ్బందికి వసతులు కల్పించడానికి నివాసం నిర్మించారు. గతంలో ఉన్న అర్చకుడు ఆ నివాసాన్ని వదిలి వేరే ఆలయానికి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఆ నివాసంతో పాటు పక్కనే ఖాళీగా ఉన్న మరో ఇంటిని రాంనగర్‌కు చెందిన ఒక వ్యక్తి హస్తగతం చేసుకుని కేటరింగ్ వ్యాపారం సాగిస్తున్నాడని రాంనగర్‌లో పలువురు ఆరోపిస్తున్నారు. పవిత్రమైన ఆలయ పరిధిలో మాంసాహార వంటలు సైతం నిర్వహించడం కొసమెరుపు. స్థానికంగా ఉన్న కొందరు బడాబాబులను అడ్డుపెట్టుకొని కేటరింగ్ వ్యాపారం నిర్వహిస్తున్నాడని ఆరోపిస్తున్నారు. ఆ నివాసాల్లో వసతులు కల్పించి తమకు కేటాయిస్తే అద్దె భారం తప్పుతుందని అర్చకులు అంటున్నారు. కాగా కేటరింగ్ నిర్వహిస్తున్న వ్యక్తిని ఆలయ పరిపాలన అధికారి ఖాళీ చేయాలని చెప్పినా తిప్పవేయడం పలు అనుమానాలకు తావిస్తోంది.

వైభవంగా ముగ్గురమ్మల ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న సంతానలక్ష్మి, కల్యాణ లక్ష్మి, నూకాలమ్మతల్లి



పారాయణలో పాల్గొన్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడక నూదికొండపై వెలిసిన సంతానలక్ష్మి, కల్యాణ లక్ష్మి, నూకాలమ్మ అమ్మవార్ల ఆలయాల మూడో వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అగనంపూడి, కొండయ్యవలస, అట్టవానిపాలెం, నిర్వాసితకాలనీల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి పసుపు కుంకుమ,చీర, సారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని లలిత సహస్ర పారాయణ చేశారు. ఆలయ ధర్మకర్త బల్ల పైడిరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. బలిరెడ్డి తరుణ్‌సాయి, తాతికొండ వెంకటరావు, గొక్కాడ ఉదయ్‌భాస్కర్, కరణం లక్ష్మి, అప్పారావు, బల్లా దేవి, కోసూరి రమణమ్మ, గెద్దాడ విజయకుమారి, మోపాడ దేవి తదితరులు పాల్గొన్నారు.

తుంగ్లాం రోడ్డును అభివృద్ధి చేస్తాం



సాక్షిలో ప్రచురితమైన కథనం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు ఆటోనగర్ నుంచి తుంగ్లాం వెళ్లే రోడ్డు పిక్కతేలిపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులపై మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన పూత పూశారు.. మేత మేశారు కథనానికి జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు స్పందించారు. ఇటీవల కురిసిన వర్షాలకు బీటీ రోడ్డుపై అక్కడక్కడ తారు, కాంక్రీట్ పిక్క లేచిపోయిందని అధికారులు పేర్కొన్నారు. రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామనిగాజువాక జోన్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు తెలిపారు. రోడ్డు మరమ్మతుల నిమిత్తం అంచనా తయారు చేసినట్టు వెల్లడించారు. పరిపాలనా పరమైన ఆమోదం లభించిన తర్వాత టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపట్టనున్నట్లు వివరణ ఇచ్చారు. సమస్యను ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన 'సాక్షి'కి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.